RNI. No. APTEL/2011/41055






# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 15 సంచిక : 159 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శుక్రవారం, 12 డిసెంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 2/-





# 13లక్షల ఉద్యోగాలు..

## అదిరిపోయే ప్రకటనతో...

## నిరుద్యోగులకు కొత్త ఆశలు!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి పైన ఫోకస్ చేస్తుంది. ఈ మేరకు తాజాగా జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ప్రణాళికలను సైతం ప్రకటించింది.

ఇదే సమయంలో నిరుద్యోగులకు కూడా శుభవార్త చెప్పింది తెలంగాణ సర్కార్. మూడు ట్రిలియన్ డాలర్స్ తెలంగాణ భారత్ ఫ్యూచర్ సిటీ భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను ప్రకటించిన ప్రభుత్వం 13,500 ఎకరాలలో అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో, అద్భుతమైన మౌలిక సదుపాయాలతో, జీరో కార్బన్ సిటీగా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందని వెల్లడించింది. మూడు ట్రిలియన్ డాలర్స్ తెలంగాణ భారత్ ఫ్యూచర్ సిటీ అనే అంశం పైన మాట్లాడిన మంత్రి శ్రీధర్ బాబు ఈ ప్రణాళికలను వెల్లడించారు.

13 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారత్ ఫ్యూచర్ సిటీ నగరం ఆరు అర్బన్ జిల్లాలుగా రూపుదిద్దుకుంటుందని చెప్పిన శ్రీధర్ బాబు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హెల్త్ సిటీ, ఎంటర్టైన్మెంట్ క్రీడలు, డేటా సెంటర్లు, అంతర్జాతీయ ఉన్నత విద్యా సంస్థల కోసం ప్రత్యేకంగా ఈ ఆరు జిల్లాలను నెలకొ ల్పనున్నట్టు చెప్పారు. దీంట్లో మొత్తం 13 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు తీపి కబురు ఈ వార్త ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు తీపి కబురుగా మారింది. దాదాపు తొమ్మిది లక్షల మంది జనాభా కోసం నివాస గృహ సముదాయాలను కూడా నిర్మిస్తామని, వీటిని నిర్మాణ రంగ నిపుణులు అభివృద్ధి చేస్తారని చెప్పడం, ఎంతోమందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని చెప్పడానికి అవకాశం ఇచ్చింది.

**త్వరలోనే స్కిల్ యూనివర్సిటీ.....** యువత భవిష్యత్ కు భరోసా మొత్తంగా తాజాగా తెలంగాణ ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో తీసుకున్న నిర్ణయం తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ భరోసా కల్పిస్తుంది అన్న అభిప్రాయం సర్వత్ర వ్యక్తమౌతుంది. మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కార్యక్రమాలు కూడా ప్రారంభమవుతాయని ఇటీవల ప్రకటించడం కూడా యువతకు సంతోషాన్ని కలిగించింది. ఏది ఏమైనా యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వీరి ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు దోహదం చేస్తే బావుంటుంది అన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.




న్యూఢిల్లీ, డిసెంబర్ 11: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరారు. హైదరాబాద్ బయలుదేరే ముందు పార్లమెంటులో సీఎం మీడియాతో ముచ్చటించారు. ఈనెల 13న ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మెస్సీ హైదరాబాద్ వస్తున్నారని తెలిపారు. ఒక ప్రముఖ సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెస్సీ హాజరవుతున్నారని.. ముఖ్యమంత్రిగా ఉన్నాను కాబట్టి తనను కూడా ఒక అతిథిగా పిలిచినట్లు చెప్పారు. తాను కూడా ఒక అతిథిగానే ఆ కార్యక్రమానికి హాజరవనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఈ కార్యక్రమానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఒక ప్రముఖ క్రీడాకారుడు హైదరాబాద్‌కు వస్తున్నారు కాబట్టి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఇస్తున్నామని తెలిపారు. మెస్సీ కార్యక్రమానికి రావాలని కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంక గాంధీలను కోరానని.. అలాగే ఢిల్లీలో కలిసిన అందరినీ ఆ కార్యక్రమానికి ఆహ్వానించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా.. ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ బిజీబిజీగా గడిపారు. ఈరోజు ఉదయం పార్లమెంట్‌లో ఏఐసీసీ అధక్షులు మల్లికార్జునఖర్గేతో పాటు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో సమావేశమయ్యారు. ఇటీవల రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలు, గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన అంశాలను వారి దృష్టి తీసుకెళ్లారు. గ్లోబల్ సమ్మిట్‌ను ఏ విధంగా విజయవంతం చేశామనే అంశాలపై చర్చించారు. ఆపై ఢిల్లీ పర్యటనను ముగించుకుని సీఎం హైదరాబాద్‌కు పయనమయ్యారు.

# ట్రంప్ కార్డ్: ఒక్క క్లిక్ తో అమెరికా పౌరసత్వం- భారత్ కు గోల్డెన్ ఆఫర్




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'గోల్డ్ కార్డ్' వీసాను ఆవిష్కరించారు. విదేశీయులు అమెరికాలో శాశ్వత నివాసం పొందడానికి ఉద్దేశించినది. అమెరికా ట్రెజరీకి మిలియన్ డాలర్లను విరాళంగా ఇవ్వడం ద్వారా ఈ వీసాను పొందవచ్చు. దీనికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించే వెబ్‌సైట్ ను కూడా ఆయన ప్రారంభించారు. ఇది కూడా గ్రీన్ కార్డ్ లాంటిదేనని, దానికంటే గొప్ప ప్రయోజనాలు ఇందులో ఉన్నాయని డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. వ్యక్తిగత, కార్పొరేట్ గోల్డ్ కార్డ్ వీసాల దరఖాస్తులు ప్రస్తుతం ప్రభుత్వ పోర్టల్‌లో అందుబాటులో ఉన్నాయి. వ్యక్తులు/కంపెనీలు దీన్ని కొనుగోలు చేయవచ్చు. ఈ కార్డ్ ఆవిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్పొరేట్ కంపెనీలకు ఇది ఉపయోగపడుతుందని, అధిక నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణులను తమ వద్దే నిలుపుకోవాలనుకునే వారికి ఓ చక్కని అవకాశమని అన్నారు. ఉన్నత విద్యా సంస్థల నుండి పట్టభద్రులు, ప్రతిభావంతులను స్పాన్సర్ చేయడానికి, వారిని అమెరికాలో ఉంచుకోవడానికి ఆయా కంపెనీలకు వీలు కలుగుతుందని వివరించారు. వార్టన్ స్కూల్ ఆఫ్ ఫైనాన్స్, స్టెర్న్ బిజినెస్ స్కూల్, హార్వర్డ్, మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి విద్యా సంస్థలకు చెందిన ఉన్నత విద్యాసంస్థలకు చెందిన గ్రాడ్యుయేట్లను స్పాన్సర్ చేయవచ్చని తెలిపారు. గోల్డ్ కార్డ్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకుని రావాలని ఆపిల్ వంటి సంస్థలు కూడా ఒత్తిడి తెచ్చాయని అన్నారు. ఆ సంస్థ అధినేత టిమ్ కుక్ దీని గురించి తనతో అనేకసార్లు మాట్లాడారని ట్రంప్ పేర్కొన్నారు. గోల్డ్ కార్డ్ దరఖాస్తుదారులు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కు 15,000 డాలర్ల ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాలి.

ఇది– నాన్ రీఫండబుల్. ఆ వెంటనే ఆయా దరఖాస్తులన్నీ కూడా ప్రాసెస్ అవుతాయి. దీని తర్వాత దరఖాస్తుదారులు అమెరికా ప్రభుత్వానికి ఒక మిలియన్ డాలర్లను చెల్లించాల్సి ఉంటుంది. ట్రంప్ కార్పొరేట్ గోల్డ్ కార్డ్ ద్వారా కార్పొరేట్ కంపెనీలు ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులను స్పాన్సర్ చేయవచ్చు. ప్రతి ఉద్యోగికి రెండు మిలియన్ డాలర్లను చెల్లించాలి.

ఒకసారి చెల్లిస్తే సరిపోతుంది. ఇదే మొత్తంతో ఆయా కంపెనీలు మరో కొత్త ఉద్యోగికీ బదిలీ చేసుకోవచ్చు. అలాంటప్పుడు మళ్లీ రెండు మిలియన్ డాలర్లను చెల్లించనక్కర్లేదు. బదిలీ చేయించుకోవాల్సిన అవసరం వచ్చినప్పుడు ఒక శాతం మేనేజ్మెంట్ ఫీ, అయిదు శాతం ట్రాన్స్ ఫర్ ఫీ చెల్లించాలి. భారత్, చైనా, ఫ్రాన్స్ వంటి దేశాల నుండి వచ్చిన ట్రైన్డ్ గ్రాడ్యుయేట్లు తమ చదువులను పూర్తి చేసిన అనంతరం దేశం విడిచి వెళ్లకుండా నిరోధించే ఉద్దేశ్యంతో గోల్డ్ కార్డ్‌ను రూపొందించినట్లు ట్రంప్ వివరించారు. ఇది ఇప్పటివరకు అమలు చేసిన బెస్ట్ వెట్టింగ్ గా అభివర్ణించారు.




# గెలిచినోడే మనోడు!

## పంచాయతీ పోరులో 'కొత్త ఫార్ములా'

హైదరాబాద్ : తెలంగాణ పంచాయతీ పోరులో మొదటి విడత ముగిసింది. రెండు, మూడు విడతలకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో ఒకే పార్టీ నుంచి ఇద్దరు.. ముగ్గురు పోటీ పడుతున్నారు. వారి కి ఆ పార్టీ నేతలు సర్ది చెప్పలేక గెలిచినోడే మనోడు అనే పరిస్థితికి వచ్చేశారు. ప్రధానంగా అధికార పార్టీకి రెబల్స్ బెడద ఎక్కువగా ఉంది.

సర్ది చెప్పినా వినకపోవడంతో పోటీ అనివార్యమైంది. గెలిచి రండంటూ ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రధానంగా అధికార పార్టీ మద్దతుతో పోటీ చేస్తున్న అభ్యర్థులకు, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసొచ్చి ఎన్నికల్లో నిలబడిన అభ్యర్థులకు మధ్య లోకల్ వార్ నడుస్తోంది. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియడంతో ప్రచారం ఊపందుకుంది.

**లోకల్ వార్..** మొదటి, రెండో, మూడో విడత పంచాయతీ ఎన్నికల ప్రచార సరళిని పరిశీలిస్తే.. ఓటర్లు ఎవరికి మద్దతిస్తున్నారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మెజార్టీ గ్రామాల్లో కాంగ్రెస్ రెండు వర్గాలు పోటీ చేస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరి పోటీ చేస్తున్న అభ్యర్థులు సైతం దీటుగానే తలపడుతున్నారు. ఇరువర్గాలు బలంగా ఉన్న గ్రామాల వైపు పార్టీ కీలక నేతలు చూసీచూడనట్టుగానే వదిలేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక చూద్దాంలే అన్నట్టుగా డబుల్ గేమ్ ఆడుతున్నారని తెలుస్తోంది. అయితే పలువురు అభ్యర్థులు పార్టీ మద్దతు మాకంటే మాకే ఉందని ప్రచారం చేయడమే గాక.. ప్రచారం వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

**పార్టీ జెండాలతోనే ప్రచారం...** పార్టీల రహితంగా జరిగే ఎన్నికలే అయినా.. అభ్యర్థులు మాత్రం పార్టీల జెండాలతోనే వాడవాడలా ప్రచారం చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నాయి. ప్రధాన పార్టీలన్నీ స్థానికంగా అవగాహనతోనే పోటీ చేస్తున్నాయి.

**మద్యం, డబ్బు పంపిణీ...** ఎన్నికల ప్రచార పర్వంలో భాగంగా మద్యం, డబ్బు ఏరులై పారుతున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే మద్యం పంపిణీ జోరుగా సాగుతుండగా.. ఓటర్లకు పెద్ద గ్రామ పంచాయతీల్లో రూ.వెయ్యి నుంచి రూ.2వేలతోపాటు క్వార్టర్, ఓ మోస్తరు పంచాయతీల్లో మందుతోపాటు రూ.500, చిన్న గ్రామాల్లో మందు మాత్రమే పంపిణీ చేస్తున్నట్లు తెలుస్తోంది.



# సర్పంచ్ ఎన్నికలలో...

## కాంగ్రెస్ విజయ దుందుభి

హైదరాబాద్: తెలంగాణలో తొలి విడత పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొంది తొలి స్థానంలో ఉంది.

కాంగ్రెస్ ఇప్పటి వరకు 990 స్థానాలలో గెలుపొందగా.. బిఆర్ఎస్ 445, బిజెపి 83, ఇతరులు 210 స్థానాలలో విజయం సాధించారు. వార్డు మెంబర్లలో కాంగ్రెస్ 11230 స్థానాలలో గెలుపొందగా బిఆర్ఎస్ 5000, బిజెపి 2000, ఇతరలు 7500 స్థానాలలో విజయ దుందుభి మోగించారు.

కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. ఇతరుల స్థానాలలో గెలిచిన వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## భారత్ విషయంలో మారిన ట్రంప్ స్వరం..

## జాతకం చెబుతున్నారా?

జరిగింది చెబుతాము, జరబోయేది చెబుతాము అన్నట్లుగా భారత్ తీసుకునే నిర్ణయాలు, చేసే పనుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతకాలు చెప్పినట్లుగా మాట్లాడుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో ఇప్పటికే చాలా సార్లు మాట్లాడిన ట్రంప్.. ఈ సారి మాత్రం స్వరం కాస్త మార్చారు.. ఫ్యూచర్ టెన్స్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా మోడీపై ప్రశంసలు కురిపించారు. అవును... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ ను ఉద్దేశిస్తూ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీని ప్రస్తావిస్తూ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో రష్యా చమురు కొనుగోళ్ల విషయంపై స్పందిస్తూ... ఆ దేశ చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ గతంలో ప్రకటించిన ఆయన... తాజాగా భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనబోదంటూ వ్యాఖ్యానించారు. మొన్నటివరకు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ స్వయంగా ప్రకటించేసిన ట్రంప్.. తాజాగా మాట్లాడుతూ.. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనబోదని వ్యాఖ్యానించారు. అందుకు కారణం... తనలాగానే మోడీ కూడా ఉక్రెయిన్ – రష్యాల మధ్య యుద్ధం ముగియాలని కోరుకుంటున్నారని ట్రంప్ అన్నారు. అయితే.. దీనిపై భారత్ ఏమాత్రం స్పందించలేదు!

**వైట్ హౌస్ లో దీపావళి!:** స్థానిక కాలమానం ప్రకారం.. వైట్ హౌస్ లో దీపావళి వేడుకలు నిర్వహించారు. ఇందులో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సహా కీలక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ – అమెరికన్లకు ట్రంప్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. తనకు భారతీయులంటే చాలా ఇష్టమని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసలు కురిపించారు. ఇందులో భాగంగా... ఆయన గొప్ప వ్యక్తి అని, గొప్ప స్నేహితుడని కొనియాడారు. మోడీతో తాను ఫోన్ లో మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమ మధ్య గొప్ప సంభాషణ జరిగిందని.. అనేక విషయాల గురించి తాము మాట్లాడుకున్నామని.. ప్రధానంగా వాణిజ్యం గురించి చాలాసేపు చర్చించామని.. ఆయనకు దానిపై చాలా ఆసక్తి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే.. ట్రంప్, మోడీల ఫోన్ సంభాషణ గురించి భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

**భారత్ – అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం!:** భారత్ – అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం అతిత్వరలో ఖరారయ్యే సంకేతాలు కన్పిస్తున్నాయని జాతీయ మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ ఒప్పందంతో భారత్ పై ట్రంప్ టారిఫ్ లు భారీగా దిగి రానున్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో.. ప్రస్తుతం 50శాతం ఉన్న టారిఫ్ లు.. 15-16 శాతానికి తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. మరోవైపు కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ కూడా వాణిజ్య ఒప్పందం ఖరారుపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించి తన వద్ద ఎలాంటి ఇన్ సైడర్ సమాచారం లేదు కానీ... రాబోయే రెండు నెలలు లేదా అంతకంటే ముందే ఇరు దేశాలు సమస్యలను పరిష్కరించుకుని ఒప్పందంపై ఏకాభిప్రాయానికి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలిపారు.

## ఆర్థిక వనరులు.. పల్లె ప్రగతికి మెట్లు



కరీంనగర్ : జిల్లాలోని గ్రామాల్లో పాలకులను ఎన్నుకొనే ప్రక్రియ పోటాపోటీగా జరుగుతోంది. మరో 15 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ మొత్తం ముగిసి గ్రామాలకు కొత్త పాలక వర్గాలు కొలువుదీరుతాయి. అయితే గ్రామ పాలన సక్రమంగా నడవాలంటే ఆర్థిక వనరులు అవసరమవుతాయి. అయితే గ్రామంలో నిత్యం జరిగే పనుల నిర్వహణకు ఏయే పద్దుల నుంచి డబ్బులు వస్తాయి. గ్రామాభివృద్ధికి ఎక్కడి నుంచి నిధులు వస్తాయి. తదితర అంశాలపై ప్రత్యేక కథనం.

**కేంద్ర ఆర్థిక సంఘం**

గ్రామాల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర ఆర్థిక సంఘం ఈ నిధులు విడుదల చేస్తుంది. గ్రామాల్లో అభివృద్ధి పనులకు వీటిని వినియోగించాల్సి ఉంటుంది. జనాభా ప్రాతిపదికన గ్రామంలో ప్రతి ఒక వ్యక్తికి రూ.80 నుంచి రూ.90 చొప్పున ప్రతి మూడు నెలలకోసారి కేటాయిస్తుంది. పాలకవర్గం కొలువుదీరి ఉంటేనే ఈ నిధులు విడుదలవుతాయి. గత 18 నెలలుగా గ్రామాలకు పాలకవర్గాలు లేకపోవడంతో ఈ నిధులు రాలేదు.

**ఉపాధి హామీ నిధులతో..**

గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధి హామీ పనుల కోసం ప్రత్యేకంగా కేంద్రం ఈజీఎస్ కింద రెండు, మూడునెలల కోసారి కూలీల ఖాతాలకు నేరుగా జమ చేస్తుంది. కూలీల వేతనాలకు 60 శాతం నిధులు విడుదల చేస్తుండగా, సామగ్రి ఖర్చుల కోసం 40 శాతం నిధులు విడుదల చేస్తుంది. వీటితో గ్రామాల్లో మురుగు కాలువలు, ఇంకుడుగుంతలు, సామూహిక, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, నూతన సీసీ రోడ్ల నిర్మాణం చేపడతారు.

**రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు (ఎస్ఎఫ్‌సీ)**

వీటిని పంచాయతీ జనాభా ప్రాతిపదికన ఇస్తారు. కొంతకాలంగా ప్రభుత్వం నుంచి విడుదల కావడం లేదు. వీటిని మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలతోపాటు విద్యుత్తు బిల్లులు, గ్రామంలో ఇతర చిన్నా చితక ఖర్చులకు వినియోగిస్తారు.

జనరల్ ఫండ్(గ్రామ పంచాయతీలు సొంతంగా సమకూర్చుకునే నిధులను జనరల్ ఫండ్(సాధారణ నిధులు)గా గుర్తిస్తారు. వీటిని పంచాయతీలో ప్రణాళిక రూపొందించుకొని సమావేశంలో తీర్మానంతో ఖర్చు చేయాల్సి ఉంటుంది.

స్థానిక పన్నులు గ్రామంలో ఇంటి నిర్మాణం అనుమతికి, ఇంటి పన్నులు, నల్లా బిల్లులు, ఆస్తి మార్పిడి, వారసంతలపై పన్నులతో గ్రామ పంచాయతీ ఖాతాకు నిధులు జమ అవుతాయి.

## నిబంధనలు తూచ్..!



బీబీనగర్ : జాతీయ రహదారి 163పై చేపడుతున్న వంతెన నిర్మాణ పనులు ప్రయాణికుల పాలిట శాపంగా మారాయి. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై బీబీనగర్ మండలం కొండమడుగుమెట్టు, ఎయిమ్స్ సమీపంలో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ఆయా కూడళ్లను బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు. ఇక్కడ వంతెనలు నిర్మిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ప్రభుత్వానికి అధికారులు నివేదికలు పంపగా..

బీబీనగర్ మండలం కొండమడగుమెట్టు కూడలి, రంగాపురం ఎయిమ్స్ ఆసుపత్రి ఎదురుగా వంతెనల నిర్మాణానికి నిధులు కేటాయించారు. టెండర్లు దక్కించుకున్న గుత్తేదారు ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటుచేయకుండానే పనులు ప్రారంభించడంతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు.

వరంగల్ – హైదరాబాద్ మార్గంలో కొండమడుగుమెట్టు సమీపంలో కనీస సూచిక బోర్డులు, రక్షణ వలయం ఏర్పాటు చేయలేదు. ఈ కారణంగా చోదకులు అయోమయానికి గురవుతున్నారు. ఒక్కసారిగా వాహనాలను నియంత్రించాల్సి రావడంతో ఆ వెనుకే వచ్చే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బీబీనగర్ బ్యాంకుల సమీపంలో సర్వీసు రోడ్డు ద్విచక్ర వాహనాలకు పార్కింగ్‌గా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ మార్గంలో ప్రయాణమంటేనే ప్రయాణికులు భయపడాల్సిన దుస్థితి నెలకొంది. కేపాల్ నుంచి కొండమడుగుమెట్టు వచ్చే మార్గంలో కొండమడుగుమెట్టు మసీదు వద్ద ప్రధాన రహదారి నుంచి సర్వీసు రోడ్డు వైపు మళ్లే చోట కనీసం సూచిక బోర్డు ఏర్పాటుచేయలేదు. వరంగల్ – హైదరాబాద్ ప్రధాన మార్గం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

**తక్షణమే చేయాల్సింది...**

వంతెన నిర్మాణ పనులు జరిగే ప్రాంతాన్ని ముందే గుర్తించి ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఏర్పాటుచేయాలి.

వాహనాలు దారి మళ్లే చోటుకు 100 మీటర్ల ముందే సూచికలు, బారికేడ్లు ఏర్పాటుచేయాలి.

ప్రధాన రహదారి నుంచి సర్వీసు రోడ్డుకు మళ్లే చోట బ్లింకింగ్ లైట్లు లేవు. వీటిని తక్షణం ఏర్పాటు చేయాలి.

ట్రాఫిక్ సమస్య తలెత్తితే వెంటనే చర్యలు చేపట్టేందుకు ట్రాఫిక్ సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

ఆయా అంశాలపై జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ వరంగల్ మేనేజర్ లింగయ్యను వివరణ కోరగా... జాతీయ రహదారి 163పై వంతెనల నిర్మాణ పనులు జరిగే సమయంలో వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నిబంధనలకు అనుగుణంగా గుత్తేదారు పనిచేసేలా చర్యలు చేపడుతున్నామని... నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## నీళ్ల సీసా ఇవ్వరు..టీవీలు పెట్టరు



మిర్యాలగూడ : ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణం అందించేందుకు ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సులను ప్రవేశపెట్టింది. పుష్ బ్యాక్ సీట్లతో పాటు టీవీ, తాగునీటి సౌకర్యం సైతం కల్పించే ఈ బస్సుల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల కంటే అధిక ఛార్జీలు వసూలు చేస్తారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం సూపర్ లగ్జరీ బస్సులే ఉన్నత శ్రేణి బస్సులుగా ఉన్నాయి. మొత్తం ఏడు డిపోలకు మూడు డిపోల్లో సూపర్ లగ్జరీ బస్సులు ఉండగా.. మిర్యాలగూడ డిపోలో 13 విద్యుత్తు బస్సులతో కలిపి అత్యధికంగా 32 బస్సులు ఉన్నాయి. సూపర్ లగ్జరీ బస్సుల్లో రూ.10 అదనపు ఛార్జీ వసూలు చేస్తున్న యాజమాన్యం ఒక్కో ప్రయాణికుడికి అర లీటరు తాగునీటి సీసా అందిస్తున్నారు. పలు బస్సుల్లో డ్రైవర్లు ప్రయాణికులు అడిగితేనే నీళ్ల సీసాలు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నీళ్ల సీసాలు ఉచితంగా అందిస్తారని తెలియక అనేక మంది ప్రయాణికులు బయట డబ్బులు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. టిక్కెట్‌తో పాటే సీసా అందించకుండా మిగిలిన సీసాలను పలువురు డ్రైవర్లు హోటళ్లలో అమ్ముతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సూపర్ లగ్జరీ బస్సుల్లో టీవీలు ఉండగా పలు బస్సుల్లో ఈ టీవీలు పని చేయకపోగా...మరి కొన్ని వాటిల్లో డ్రైవర్లు టీవీలు ఆన్ చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధిక ఛార్జీ చెల్లించి ప్రయాణిస్తున్న తమకు సౌకర్యాల్లో కోత విధిస్తుండటంతో నష్టపోతున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో టీవీలు ఉండగా పలు బస్సుల్లో ఈ టీవీలు పని చేయకపోగా... మరి కొన్ని వాటిల్లో డ్రైవర్లు టీవీలు ఆన్ చేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. అధిక ఛార్జీ చెల్లించి ప్రయాణిస్తున్న తమకు సౌకర్యాల్లో కోత విధిస్తుండటంతో నష్టపోతున్నామని పలువురు ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. డ్రైవర్లకు ఆదేశాలిస్తాం... –కొణతం జాన్‌రెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నల్గొండ.

సూపర్ లగ్జరీ బస్సుల్లో టిక్కెట్‌తో పాటే ప్రయాణికులకు తాగునీటి సీసాలు అందించేలా డ్రైవర్లకు ఆదేశాలిస్తాం. బస్సుల్లో టీవీలు సక్రమంగా పని చేసేలా గుత్తేదారు సంస్థకు సూచనలు చేస్తాం. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షిత, సుఖవంతమైన ప్రయాణం అందించేందుకు చర్యలు తీసుకుంటాం.

## ప్రభుత్వ వైద్య కళాశాలకు పీజీ కళ?

ఖమ్మం : వైద్యవిద్యతోపాటు వైద్యసేవల్లో నాణ్యతను పెంచే దిశగా ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాల కీలక ముందడుగు వేసింది. మూడేళ్ల క్రితం ప్రారంభమైన యూజీ కళాశాలలో తొలి ఎంబీబీఎస్ బ్యాచ్ తృతీయ సంవత్సరానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో పీజీ కోర్సుల ప్రారంభానికి ప్రతిపాదనలు పంపించారు. కళాశాల ప్రిన్సిపల్, హెచ్ఓడీలు, ఇతర అధికార యంత్రాంగం ఈ ప్రక్రియను పూర్తి చేసి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ), నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)కు సమర్పించారు.

**ప్రతిపాదనలు ఇలా..**

కళాశాలలో ఐదు కీలక విభాగాల్లో ఒక్కో దానికి ఐదు సీట్ల చొప్పున మొత్తం 25 పీజీ కోర్సు సీట్లు మంజూరు చేయాలని ప్రతిపాదించారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, ఆర్థో, అనస్తీసియా విభాగాలకు సంబంధించి ఐదు సీట్ల చొప్పున కేటాయించాలని కోరారు. అధికారుల అంచనా ప్రకారం వచ్చే విద్యాసంవత్సరం నాటికి పీజీ కోర్సులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**చేకూరే ప్రయోజనాలు..**

1.పీజీ కోర్సులతో సర్వజనాసుపత్రిలో పీజీలు(రెసిడెంట్లు) నిరంతరం అందుబాటులో ఉంటారు. అత్యవసర సేవలు, రాత్రివేళల్లో, సెలవు దినాల్లో కూడా నిపుణుల పర్యవేక్షణకు అవకాశం ఉంటుంది. కేసులు వేగంగా నిర్ధారణ కావటంతోపాటు చికిత్సల్లో నాణ్యత పెరుగుతుంది.

2.సంక్లిష్ట శస్త్రచికిత్సలు ఇక్కడే నిర్వహించటానికి వీలవుతుంది. బోధన,



పరిశోధన అభివృద్ధిపై కూడా దృష్టి సారించే అవకాశం లభిస్తుంది.

3.ఎంబీబీఎస్ విద్యార్థులకు క్లినికల్ ఎక్స్‌పోజర్, ప్రత్యక్ష బోధన లభించటంతో నైపుణ్యాలు మెరుగుపడతాయి.

4.పీజీ పూర్తి చేసిన వారు ఇక్కడే ఉంటూ కొంతకాలం సేవలందించాలి. స్పెషలిస్టుల కొరత తీరుతుంది.

5.ఉన్నత విద్య కోసం స్థానిక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. ఖమ్మం సర్వజనాసుపత్రి సంక్లిష్ట కేసులను స్వీకరించే సెంటర్‌గా రూపాంతరం చెందుతుంది.

'ఖమ్మం సర్వజనాసుపత్రిలో ఓపీ, ఐపీ మెరుగ్గా ఉంటుంది. మౌలిక వసతులు, మానవ వనరులు తగిన స్థాయిలో ఉన్నాయి. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అన్ని అంశాలతో ప్రతిపాదనలు పంపించాం. పీజీ సీట్ల రాకతో మరో కీలక మైలురాయికి చేరుకున్నట్టవుతుంది.' కళాశాల వైద్యాధికారులు.

## ఉచితం.. ఫలితం కచ్చితం


మంచిర్యాల : ప్రైవేటు ఆసుపత్రులబాట పట్టి రక్తపరీక్షలు చేసుకునేందుకు పేద, మధ్య తరగతి కుటుంబాలు వెనుకడుగు వేస్తున్నాయి. ఏ చిన్న పరీక్షకైనా ధరలు రూ.వందల్లో ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మూడు పదుల వయసుకు చేరారంటే ప్రతి ఒక్కరూ మూడు, ఆరు నెలలు, కనీసం ఏడాదికి ఒకసారైనా రక్తపరీక్షలు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లోనే అధునాతన సేవలు అందుబాటులోకి వచ్చాయి. తెలంగాణ డయాగ్నోస్టిక్స్(టీ-హబ్)రాకతో రక్తపరీక్షలు ఉచితంగా అందుతున్నాయి. ప్రారంభంలో 50తో మొదలై ఇప్పుడు 72 రకాల పరీక్షలకు చేరి మెరుగైన సేవలు, నాణ్యతతో కూడిన ఫలితాలను అందిస్తోంది. అధునాతన యంత్రాలు, అనుభవజ్ఞులైన ల్యాబ్ టెక్నీషియన్ల సేవలతో రాష్ట్రంలోని 33 కేంద్రాల్లో మంచిర్యాల టీ-హబ్ ప్రతినెలా మొదటి ఐదు స్థానాల్లో నిలుస్తుండటం విశేషం.

**జిల్లాలో ఎక్కడ ఉన్నా..**

ప్రైవేటు ల్యాబ్‌లో రక్తపరీక్ష చేసుకోవాలంటే రూ.500-1000ఖర్చు చేయాల్సిందే. గ్రామీణులు జిల్లా కేంద్రానికి వచ్చి పరీక్షలు చేసుకోవాలంటే కష్టం. ఇప్పుడు జిల్లాలో ఎక్కడ ఉన్నా టీ-హబ్‌లో అందే 72 రకాల్లో ఏ పరీక్ష అయినా చేయించుకోవచ్చు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి.. ఇబ్బందిని తెలియజేసి..రక్త నమూనా అందిస్తే సరిపోతుంది. ఖరీదైన పరీక్షలు సైతం 12 గంటల్లో ఉచితంగా పొందొచ్చు. సీబీపీ నుంచి తలసీమియా, సికిల్‌సెల్, విటమిన్ బీ12, థైరాయిడ్, టీఆర్, ఏబీసీ వంటివి కూడా ఉచితం. వీటికి బయట రూ.500-రూ.2500వరకు ఉంటాయి.

**అపోహలు వీడండి**

టీ-హబ్‌లో అందుతున్న సేవలపై కొందరు ప్రైవేటు వైద్యులు, ల్యాబ్



నిర్వాహకులు అపోహలు సృష్టిస్తున్నట్లు తెలుస్తోంది. ఏ మాత్రం తేడా ఉండదని, వందశాతం నాణ్యమైనవి, నమ్మకమైనవంటూ ఈక్వాస్ ధ్రువీకరణ పత్రం అందించింది. జిల్లావాసులు చాలా వరకు ప్రభుత్వ ఆసుపత్రులబాట పడుతూ, రక్తపరీక్షలు సైతం అక్కడే చేసుకుంటుండటంతో బాధితులను కొంతమంది తప్పుదోవ పట్టిస్తున్నారు. అనుమానాలు, సందేహాలు అవసరంలేదని ఉచిత ఆరోగ్య సేవలను పొందాలని సంబంధిత కేంద్రం నిర్వాహకులు సూచిస్తున్నారు.

టీ-హబ్ సేవలు పొందుతున్న జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల సంఖ్య: 33 (పీహెచ్‌సీ-18, యూపీహెచ్‌సీ-5, సీహెచ్‌సీ-1, ఏహెచ్-2, ఎంసీహెచ్-1, జీజీహెచ్-1, పీఎం జన్మన్-1, బీడీకే-4)

ఇప్పటి వరకు ఈ సేవలు అందుకున్న వారి సంఖ్య: 2,37,740

స్వీకరించిన రక్తనమూనాలు: 4,44,403

పరీక్షలు: 7,68,967

మొత్తం వ్యాధి నిర్ధారణ పరీక్షలు: 40,89,939.

# మరో 70 ఎకరాలు.. రూ.7 వేల కోట్ల లక్ష్యం!

హైదరాబాద్: కోకాపేట నియోపొలిస్ లేఅవుట్‌లో ప్లాటు కాసుల వర్షం కురిపించడంతో కొత్త ఏడాదిలో మిగతా భూమినీ వేలం వేసే దిశగా హెచ్ఎండీఏ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ నెలలో నియోపొలిస్ లేఅవుట్‌లో 3 దఫాలుగా 29 ఎకరాలను ఆన్‌లైన్‌లో వేలం వేసిన సంగతి తెలిసిందే. ఊహించిన దానికంటే బిల్డర్ల నుంచి స్పందన వచ్చింది. ఎకరాకు అత్యధికంగా రూ.151 కోట్లు పలికింది. మొత్తం 29 ఎకరాలకు రూ.3,862.8 కోట్ల ఆదాయం సమకూరింది. ఇదే లేఅవుట్‌లో ఉన్న 70 ఎకరాలను కూడా విక్రయించాలని యోచిస్తోంది. ఇదే భూమిని పదేళ్ల క్రితం ఐటీ ఎస్ఈజడ్‌కు కేటాయించారు. మొత్తం 11 కంపెనీలకు ఈ భూమిని



లీజుకు ఇచ్చారు. ఇంతవరకు ఒక్క కంపెనీ కూడా ఆ భూమిలో సంస్థలను ఏర్పాటు చేయలేదు. ఇప్పటికే కొని కంపెనీలు లీజు నుంచి విరమించుకున్నట్లు హెచ్ఎండీఏకు సమాచారం ఇచ్చాయి. కంపెనీలకు ఇచ్చిన గడువు కూడా ముగియడంతో భూమి మొత్తం హెచ్ఎండీఏ ఆధీనంలో ఉంది. ఇందులో భారీ రహదారులు ఇతర మౌలిక వసతులు కల్పించారు. ఆ సంస్థల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది. అది పరిష్కారమైతే ఈ భూమిపై పూర్తి హక్కులు హెచ్ఎండీఏకు రానున్నాయి. అప్పుడు ఇబ్బంది లేకుండా విక్రయించేందుకు అవకాశం ఉన్నట్లు తెలిసింది.


**భారీ ఆదాయంపై హెచ్ఎండీఏ కన్ను**

ఎకరాకు రూ.100 కోట్లు పలికినా 70 ఎకరాలకు రూ.7 వేల కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నారు. అనుకున్న దానికంటే స్పందన వస్తే రూ.8 వేల కోట్లు దాటినా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు. 2047 రైజింగ్ తెలంగాణలో భాగంగా నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సర్కార్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రజారవాణాకు మెట్రో విస్తరణ, బీఎస్‌టీఆర్, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి నిధుల సమస్య వెంటాడుతోంది. వేలంతో వచ్చే నిధులను వీటికి వెచ్చించాలని ఆలోచిస్తోంది. మియాపూర్, జవహర్‌నగర్ భూముల తరహాలో ఖాళీగా ఉంచితే ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి.

# ప్రాణవాయువుకు ప్రాణం పోద్దాం

హైదరాబాద్: రెవెన్యూ రికార్డుల ప్రకారం మహానగరంలో 800 చెరువులున్నాయి. ఇందులో చాలావరకు కాలుష్య కాసారాలుగా మారిపోగా మరికొన్ని వ్యర్థాలతో డంపింగ్‌యార్డులుగా మారిపోతున్నాయి. పారిశ్రామిక, గృహ వ్యర్థాలను నేరుగా పంపుతుండటంతో నీటిలో కరిగిన ఆక్సిజన్ (డీవో) పరిమాణం పడిపోతోంది. పీసీబీ నివేదిక ప్రకారం.. సుమారు 40 చెరువుల్లో ఆశించిన స్థాయిలో డీవో లేదు. చాలా చెరువుల్లో 0.3–2.8 మధ్య నమోదవ్వడం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో సహజ, యాంత్రిక పద్ధతుల్లో ఆక్సిజన్ పెంచే పద్ధతులను అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

తగ్గడానికి కారణాలివే.. గుర్రపు డెక్క పెరగడం, కలుషిత నీరు



జలాశయాల్లో చేరడం, వాతావరణంలో మార్పులు, నీటి మట్టం తగ్గడం. **ఇవి పాటించాలి..** ప్యాడిల్ వీల్ లేదా స్ప్రే ఎరేటర్లు వాడాలి. నీటి ఉపరితలాన్ని పెంచి ఫౌంటేన్‌లను ఏర్పాటు చేయాలి. హార్న్‌వార్ట్, వాటర్ లిలీలు మొక్కలను నీటిలో పెంచితే నీటిలో ఆక్సిజన్ స్థాయిని పెంచడంతోపాటు ఆల్గే పెరగకుండా రక్షిస్తుంది. గుర్రపు డెక్కను తొలగించాలి. వ్యర్థ, కలుషిత జలాలను నిలువరించి తాజా నీరు వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

# పోషకాహార లోపంతో రెట్టింపు సమస్యలు

హైదరాబాద్ : 'దేశంలో ఓ వైపు పిల్లల్లో పోషకాల లేమి.. మరోవైపు కౌమారదశ, పెద్దల్లో అధిక బరువు, ఊబకాయం పెరుగుతోంది. ఇది మధుమేహం, గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి జీవక్రియ సంబంధిత రుగ్మతలకు దారితీస్తోంది. ఈ సమస్యలకు మూల కారణం అనారోగ్యకర ఆహారపు అలవాట్లే' అని జాతీయ పోషకాహార సంస్థ(ఎన్ఐఎన్) డైరెక్టర్ డాక్టర్ భారతీకులకర్ణి అన్నారు. ఎన్ఐఎన్‌లో ఫుడ్ అండ్ న్యూట్రిషన్ ఆవిష్కరణలపై జరిగిన రెండు రోజుల సదస్సు సందర్భంగా ఆమె మాట్లాడారు.

సాంకేతిక ఆవిష్కరణలతోనే..

దేశం ఎదుర్కొంటున్న పోషకాహార సమస్యలకు వేగంగా, శాస్త్రీయంగా, సాంకేతికంగా పరిష్కరించే దిశగా ఓ ప్రయత్నం చేశాం. వీటి పరిష్కారానికి ఆవిష్కరణలు ఎంతో దోహదం చేస్తాయి. ఇప్పటికే అభివృద్ధి చేస్తున్న సాంకేతికత పరిజ్ఞానాలను గుర్తించి మెరుగుపర్చడం, వారికి మెంటర్‌షిప్ అందించడం, శాస్త్రవేత్తలతో కలిసి సాంకేతికత ధ్రువీకరించడం, వేగవంతం చేయడం ద్వారా ప్రజల్లోకి తీసుకురావాల ని ఎన్ఐఎన్ ప్రయత్నం చేస్తోంది. పోషకాహారానికి సంబంధించి ఆవిష్కరణ కోసం పరిశోధనలు చేయడానికి కూడా ఆవిష్కర్తలకు సహాయం చేస్తాం.

అందుబాటులో ఉండేలా..

పోషకాల లేమి ఉందని తెలిసినా వాటిని భర్తీ చేసే ఆహారం అందుబాటులో లేకపోవడంతో చాలామంది తీసుకోలేకపోతున్నారు. ఆరోగ్యకర ఆహారాన్ని సరసమైనదిగా చేయడంలో పరిష్కారాల కోసం అన్వేషిస్తున్నాం. వీటితోపాటు ఎంత పరిమాణంలో తీసుకోవాలి..? ఆహారంలో పోషకాలను అంచనా వేసే దగ్గర్నుంచి.. రక్త నమూనాల్లో పోషక బయో మార్కర్ల వరకు.. వ్యక్తిగత ఆహారపు అలవాట్లను విశ్లేషించే, మెరుగైన డైట్‌ప్లాన్ చెప్పే యాప్స్ కావాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా, తక్కువ ఖర్చుతో రక్తహీనత వంటి లోపాలను గుర్తించే చిన్న పరికరాలు అవసరం ఉంది. ఏఐ ఆధారిత పరిష్కారాలు సైతం ఉపయోగపడతాయి.

# చేయి తడిపితేనే దస్త్రం కదిలేది!



గోదావరిఖని : రెండు నెలల కిందట కరీంనగర్‌కు చెందిన ఔషధ నియంత్రణ శాఖ సహాయ సంచాలకుడిని అనిశా అధికారులు పట్టుకొన్నారు. ఔషధ దుకాణాలకు సంబంధించిన వ్యవహారంలో లంచం డిమాండ్ చేయడంతో అనిశా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. గత నెలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో తూనికలు కొలతల అధికారిణి అనిశా వలకు చిక్కారు. లంచం డబ్బులు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసు నమోదు చేశారు. ఉన్నత ఉద్యోగం.. లక్షల్లో వేతనం.. అయినా బల్లకింద చేయిపెట్టకుంటే వారికి మనసొప్పదు. అదనంగా సంపాదించాలన్న ఆశ.. ఎదుటి వారి బలహీనతలను సొమ్ము చేసుకోవాలన్న దురాలోచన.. ప్రజలను పీడించి వసూలు చేస్తున్న వారిలో ఉన్నతాధికారుల సంఖ్య ఎక్కువగా ఉంది. సాధారణ ఉద్యోగులు కూడా అవినీతి నిరోధక శాఖ(అనిశా) వలలో చిక్కారు. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో పట్టుబడిన వారిలో ఎక్కువ మంది అధికారి హోదాలో ఉన్న వారే అధికం. చేయాల్సిన పని వారి చేతుల్లోనే ఉండటంతో వివిధ శాఖల అధిపతులు లంచం ఇవ్వనిదే దస్త్రం కదల్చమని డిమాండ్ చేస్తున్నారు. ఏటా లంచావతారులు పెరుగుతుండగా అందులో అధికారుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

**ఈ ఏడాది 23 మంది**

ఈ ఏడాది ఇప్పటి వరకు 23 మందిని అనిశా అధికారులు పట్టుకున్నారు. లంచం డిమాండ్ చేసిన వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని కేసులు నమోదు చేశారు. పట్టుకున్న 23 మందిలో 16 మంది అధికారులే ఉన్నారు. మిగతా వారు కింది స్థాయి ఉద్యోగులున్నారు. అధికారి హోదాకు చెందిన వారే లంచాలు డిమాండ్ చేసి అనిశాకు చిక్కారు.

**మారని తీరు**

అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను వలపన్ని పట్టుకుంటున్న అనిశా అధికారులు కేసులు నమోదు చేసి జైలుకు పంపుతున్నారు. ఈ కేసుల్లో చిక్కుకున్న వారికి శిక్షలు ఖరారవుతున్నాయి. అయినా లంచం అడగడంలో మార్పు రావడం లేదు. రెవెన్యూ, సర్వే, రవాణా, రిజిస్ట్రేషన్, మునిసిపల్ శాఖలు అవినీతికి కేంద్రాలుగా మారుతున్నాయి. వీటిపై మరింత దృష్టి సారిస్తే అవినీతిని నియంత్రించే అవకాశం ఉంటుంది.

అవినీతిని అడ్డుకోండిలా

టోల్‌ఫ్రీ నంబరు : 1064

వాట్సప్ నంబరు : 94404 46106

ఫేస్‌బుక్ : తెలంగాణ ఏసీబీ

ట్విట్టర్(ఎక్స్) : తెలంగాణ ఏసీబీ

# అక్షరాల ఒడి.. కొలువుల దారి



సిరిసిల్ల : ఏళ్ల తరబడి విజ్ఞానాన్ని పంచుతూ.. పోటీ పరీక్షల అభ్యర్థులను అక్కున చేర్చుకుంటోంది. జిల్లా కేంద్ర గ్రంథాలయం. 2018 నుంచి పాఠకులకు ఈ గ్రంథాలయం పాఠకులకు అందుబాటులోకి వచ్చింది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ డిజిటల్ సేవలను అందిస్తోంది. అందుకే నిరుద్యోగ యువతకు విజ్ఞానాన్ని పంచుతూ వారి భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. రెండేళ్లలో ప్రభుత్వం విడుదల చేసిన ఉద్యోగార్హత పరీక్షల్లో 120 మంది యువతీయువకులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

సదుపాయాలు

గ్రంథాలయంలో 20 కంప్యూటర్‌లు ఉన్నాయి. సాఫ్ట్‌వేర్, బ్యాంకు ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేవారు వాడుతున్నారు.

అయిదు రీడింగ్ హాళ్లల్లో హైస్పీడ్ ఉచిత వైఫై సదుపాయం. ఒకేసారి 500 మంది చదువుకోవచ్చు.

యువతీ యువకులు, పిల్లలకు వేర్వేరుగా రీడింగ్ గదులు ఉన్నాయి. సభ్యత్వం తీసుకున్న ఉద్యోగార్థులు రూ.1500 విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకోవచ్చు (కాంపిటీటివ్ పుస్తకాలు ఇంటికి ఇవ్వరు). జిల్లా నలుమూలల నుంచి నిత్యం 300 మంది వరకు వస్తుంటారు. పోటీ పరీక్షల ప్రకటనలు విడుదలైతే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. పురపాలకశాఖ అందించే రూ.5 భోజనాన్ని నిత్యం 150 మంది సద్వినియోగం చేసుకుంటున్నారు.

మ్యాగజైన్లు : 25 నెలకు దినపత్రికలు : 15 (తెలుగు, ఆంగ్లం)

పుస్తకాలు : 32,169

సభ్యత్వ రుసుము : రూ.300 సభ్యులు : 3,070

ప్రతినెలా కొత్తగా సభ్యత్వం తీసుకునేవారు : 10

సెలవు రోజులు : ప్రతి శుక్రవారం

**అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్‌గా..**


నేను ఖేలో ఇండియాలో ఉద్యోగం చేస్తున్న సమయంలో 2023లో ప్రభుత్వం ఉద్యోగ నియామకాలకు వరుస ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఆ ఉద్యోగం మానేసి గ్రంథాలయంలో ఏడాది పాటు గ్రూప్స్‌కు సిద్ధమయ్యాను. గ్రూప్–1లో 470 ర్యాంకు వచ్చింది. ఇంటర్వ్యూ వరకు వెళ్లాను. తర్వాత గ్రూప్–3, 4 వచ్చాయి. తర్వాత గ్రూప్–2లో అసిస్టెంట్ సబ్‌రిజిస్ట్రార్‌గా అవకాశం వచ్చింది. ప్రస్తుతం కామారెడ్డిలో పని చేస్తున్నాను. భువన, సిరిసిల్ల

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి..**

చెన్నైలో సాఫ్ట్‌వేర్‌గా ఏడాదిన్నర ఉద్యోగం చేశాను. 2022లో రాష్ట్రంలో పోలీసుశాఖ నోటిఫికేషన్ వెలువడగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి సిరిసిల్లకు వచ్చాను. ఉదయం ప్రైవేటు పాఠశాలలో తరగతులు చెబుతూ సాయంత్రం గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. సివిల్ కానిస్టేబుల్, ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగాలు వచ్చాయి. చివరగా సివిల్ ఎస్సైలోనూ ఉత్తీర్ణత సాధించాను. ప్రస్తుతం కరీంనగర్‌లో పని చేస్తున్నా.

సాయి కృష్ణ, సిరిసిల్ల

# కుంటలకేం తెలుసు.. కబ్జా చేస్తున్నారని?



సిరిసిల్ల : వీర్నపల్లి మండలం వన్‌పల్లిలోని రామలక్ష్మణుల కుంట ఇది. సుమారు 21 ఎకరాల్లో చెరువు విస్తరించింది. రెండేళ్ల క్రితం ఓ వ్యక్తి ఎఫ్‌టీఆర్ పరిధిలోకి ఎత్తుగా మట్టిని నింపాడు. పరిశీలించిన అధికారులు ఆక్రమణలను సర్వే ద్వారా గుర్తించారు. ఇప్పటికీ ఆ మట్టిని తొలగించలేదు. ఈ చెరువు ద్వారా పొలాలకు నీరందించే కాలువలు సైతం కనుమరుగయ్యాయి. కాలువ వెంబడి రైతులు ఆక్రమించడంతో ఆనవాళ్లు కనిపించడం లేదు. ఈ చిత్రంలో కనిపిస్తోంది కంచర్లలోని పోతరాయిని చెరువు. చెరువు సమీపంలోని రైతులు మట్టిని నింపడంతో గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పరిశీలించి ఆక్రమణలను గుర్తించి పనులను నిలిపివేశారు. ఇటీవల ఓ రైతు ఇలా చెరువులోకి రాళ్లను వేసి కమతాలను విస్తరించారు.

మెట్ట ప్రాంతమైన జిల్లాలో వ్యవసాయానికి ప్రత్యక్షంగా పరోక్షంగా గొలుసుకట్టు చెరువులే ప్రధాన ఆధారం. నిర్లక్ష్యానికి గురైన నీటి వనరులు ఆక్రమణల బారిన పడుతున్నాయి. కొద్దికొద్దిగా విస్తీర్ణం తగ్గుతూ నీటి నిల్వలపై ప్రభావం పడుతోంది.

**శాఖల సమన్వయ లోపమే శాపం**

జిల్లా పరిధిలో 656 చెరువులు, అందులో 218 సర్‌ప్లస్ ట్యాంకులు ఉన్నాయి. భూములను స్వచ్ఛందంగా రైతులు చెరువుల నిర్మాణాలకు అప్పగించారు. అప్పట్లో అంతగా విలువ లేని భూములను స్వాధీనం చేసుకోవడంలో అంత శ్రద్ధ చూపలేదు. భూములను ఇచ్చిన రైతులకు పట్టాలు ఉన్నాయి. ప్రస్తుతం వివాదాలకు దారి తీస్తున్నాయి.

గతంలో నీటి సరఫరాకు వినియోగించిన పంట కాలువలు సైతం చాలాచోట్ల కనుమరుగయ్యాయి.

వాస్తవానికి నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలిస్తున్నా చర్యల విషయంలో శాఖాపరమైన అధికారాలు లేవు. కబ్జాలు, ఆక్రమణలను రెవెన్యూ అధికారులకు సమర్పించాల్సి వస్తోంది.

వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో కబ్జాకు గురైన స్థలాలు నిర్మాణాలకు అనుకూలంగా మారుస్తుండగా పల్లెల్లో మాత్రం సాగు చేసేందుకు కమతాలుగా మారుస్తున్నారు. చెరువు పరిసరాల్లో భూములున్న రైతులు కమతాల ఎత్తు పెంచడంతో ఫలితంగా చెరువు ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవల్), నీటి నిల్వ సామర్థ్యం తగ్గి కరకట్టలకు ప్రమాదంగా మారుతున్నాయి.

సమన్వయంతో పరిశీలించి హద్దులు నిర్ణయించాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో సాధ్యం కాలేదు. పరిశీలనలకు పరిమితమైన యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో జాప్యంతో చెరువులు యథేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నాయి.

# రంగనాథా.. నీ భూమికి రక్షణ ఏదయా..!

రాయదుర్గం : గోపనపల్లి రంగనాథ ఆలయ భూమికి రక్షణ కరవైంది. సమీపంలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్న బిల్డర్లు.. ఆలయ భూమిలోంచి అక్రమంగా రోడ్డు వేస్తున్నారు. దేవాలయానికి సర్వే నం.268లో 13.18 ఎకరాల స్థలం ఉంది. ఈ జాగాకు రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. సమీపంలోని బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్న వారు.. గతంలోనూ రాత్రికి రాత్రి సీసీ రోడ్డు నిర్మించగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు తొలగించారు. తాజాగా రెండు రోజులుగా రోడ్డు వేసేందుకు నేల చదును చేశారు. 350 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో రోడ్డు



నిర్మించేందుకు యత్నిస్తున్నారు. ఈ క్రమంలో రూ.100 కోట్ల విలువైన స్థలం పోయే అవకాశం ఉంది. కొన్నాళ్లుగా ఈ తంతు కొనసాగుతున్నా, అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం– ఆంజనేయులు, ఈవో

క్షేత్రస్థాయిలో పర్యటించి.. చదును చేసిన స్థలాన్ని పరిశీలించాం. అది ఆలయ భూమి. అందులో రోడ్డు నిర్మించినా, ఆక్రమించేందుకు యత్నించినా క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. సర్వే చేపట్టి ఆలయ స్థల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతాం.

# పోలింగ్ కేంద్రాలు.. పరిష్కరించాలి సమస్యలు

గంభీరావుపేట : జిల్లాలో పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించింది. కొన్నిచోట్ల ర్యాంపులు లేకపోవడం, ఉన్నచోట్ల దెబ్బతిని కనిపించడం, ఇరుకు గదులు, పరిసరాల్లో అపరిశుభ్రత తదితర సమస్యలు కనిపించాయి. యుద్ధప్రాతిపదికన సమస్యలన్నీ పరిష్కరిస్తేనే ఎన్నికల క్రతువు సజావుగా సాగే ఆస్కారం ఉంటుంది.

**కొనసాగుతున్న నిర్మాణాలు**

ముస్తాబాద్ మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ర్యాంపుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మండలంలో 22 గ్రామాలకు 202 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో జడ్పీ బాలికల పాఠశాల–6, జడ్పీ బాలుర పాఠశాలలో–8 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. బాలుర పాఠశాలలో ఇప్పటికే 2 ర్యాంపులు ఉండగా మరో ర్యాంపు నిర్మాణం చేపడుతున్నారు.

**కానరాని ర్యాంపులు**

గంభీరావుపేట మండలంలో 22 పంచాయతీలకు 202 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. దోసల గూడెం ప్రాథమిక పాఠశాలలో ర్యాంపు లేదు. మండలంలో చాలాచోట్ల ఇదే పరిస్థితి కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఒక్కో గదిలో రెండు, మూడు పోలింగ్ కేంద్రాలు



బోయినపల్లి మండలంలో 212 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో గదిలో రెండు నుంచి మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. గదులు సరిపోని చోట వరండాలు, సమీపంలోని వినియోగంలో లేని గదుల్లో సైతం ఏర్పాటు చేశారు. ర్యాంపులు లేనిచోట్ల ఏర్పాటుపై దృష్టి సారించాల్సి ఉంది. దుంద్రపల్లి పాఠశాలలో ఎనిమిది కేంద్రాలకు రెండు గదుల్లో ఆరు.. వరండాలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

**వృద్ధులకు ఇబ్బందే..** కోనరావుపేట మండలంలో 26 గ్రామాల్లో 238 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కొన్నిచోట్ల గదుల కొరత ఉంది. దీంతో వరండాలు, వంట గదుల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. 12 పోలింగ్ బూతులు ఉన్న చోట కూడా ఒకే ర్యాంపు ఉండగా మరికొన్ని చోట్ల అసలు ర్యాంపులే లేవు. వరండాల్లో ఫ్లోరింగ్ బండలు పగిలి చిందరవందరగా ఉన్నాయి. వృద్ధులు, దివ్యాంగులు పట్టుకోవటానికి గోడ కానీ, రెయిలింగ్ కానీ లేదు.

# ఈ–పాలన.. ఎప్పుడో..?

నల్గొండ : గ్రామాల్లో ప్రజలకు పంచాయతీల ద్వారానే పౌర సేవలు అందించాలని, ఏ ఒక్కరూ తమ అవసరాల కోసం తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ఈ– పంచాయతీ విధానం అమలు చేసి అవసరమైన కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఇంటి, నీటి పన్ను వసూళ్లు, భవన నిర్మాణ అనుమతులు కూడా ఆన్‌లైన్ ద్వారానే ఇవ్వాలని ఆదేశించింది. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఇది కార్యరూపం దాల్చలేదు.

**అంతర్జాల సదుపాయం ఉన్నా..**

పంచాయతీ భవనాలకు అంతర్జాల సదుపాయం లేదని ఇన్నాళ్లు మాట దాటవేస్తూ వచ్చారు. ఇప్పుడు అందుబాటులోకి వచ్చినా ఈ–పాలన అమలుకు చర్యలు తీసుకోవడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,783 గ్రామపంచాతీలున్నాయి.

70 శాతం పంచాయతీ భవనాలకు తెలంగాణ ఫైబర్ నెట్ సంస్థ భూభాగం గుండా ఓఎఫ్‌సీ లైన్ వేసి అంతర్జాల సదుపాయం కల్పించింది. పంచాయతీ భవనాల్లో సర్వర్ ప్యానల్ బాక్సులు, భవనాలపై సోలార్ ఎనర్జీ పాయింట్లను ఏర్పాటు చేసింది.

1,177 పంచాయతీల్లో అంతర్జాల సదుపాయం అందుబాటులోకి వచ్చింది. అయినా ఈ–పాలన సేవలు ప్రారంభించడం లేదు.

**కంప్యూటర్లు మాయం**

చాలా పంచాయతీల్లో గత ప్రభుత్వం సరఫరా చేసిన కంప్యూటర్లు లేవు. కొన్ని పంచాయతీ భవనాల్లో ఉన్నా ఇవి పని చేయడం లేదు. దుమ్ము పట్టి పనికి రాకుండా పోయాయి. అంతర్జాల సదుపాయం కల్పించిన పంచాయతీ భవనాల్లో కంప్యూటర్లు, ఉండి చెడిపోయి ఉంటే వాటికి మరమ్మతులు చేయించి ఈ–పాలన అమలుకు కృషి చేయవచ్చు. ఆ ప్రయత్నమూ జరగడం లేదు.




పైలట్ల కొరత వంటి కారణాలతో కొన్నిరోజుల పాటు తీవ్ర సంక్షోభంలో చిక్కుకుపోయిన దేశీయ విమానయాన సంస్థ ఇండిగో.. పూర్తిస్థాయిలో కార్యకలాపాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఈ రోజు నడపనున్న 1950కి పైగా సర్వీసుల్లో మూడు లక్షల మంది ప్రయాణించనున్నారని వెల్లడించింది. అదే సమయంలో సర్వీసుల రద్దు కారణంగా ఇబ్బంది పడిన ప్రయాణికులకు రూ.10వేల విలువైన వోచర్‌ను పరిహారం కింద ఇస్తామని తెలిపింది. డిసెంబర్ 3-5 మధ్య సర్వీసుల రద్దు కారణంగా ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయారు. ఆ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయిన సంగతి తెలిసిందే. అలా తీవ్రంగా ఇబ్బందులుపడిన ప్రయాణికులకు (వీరిని ఎలా ఎంపిక చేస్తుందో మాత్రం వెల్లడించలేదు) ఇండిగో పరిహారం ప్రకటించింది. వారికి ఈ ట్రావెల్ వోచర్లు ఇవ్వనున్నట్లు వెల్లడించింది. రానున్న 12 నెలల్లో ఇండిగో ప్రయాణంలో వాటిని వాడుకోవచ్చని తెలిపింది. విమానం బయల్దేరడానికి 24 గంటలలోగా విమాన సర్వీసు రద్దయితే.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన పరిహారానికి ఇది అదనమని తెలిపింది. "ఇండిగో (%×అఆఇఈశ్రీ%) తన కార్యకలాపాలను బలోపేతం చేస్తోంది. సర్వీసుల పునరుద్ధరణ రోజురోజుకూ మెరుగవుతోంది. ఈ రోజు మా నెట్‌వర్క్ పరిధిలోని 138 గమ్యస్థానాలను అనుసంధానించేలా మా సర్వీసులు కొనసాగనున్నాయి" అని స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ఇండిగో వెల్లడించింది. వాతావరణం, సాంకేతిక, నియంత్రణలోని కొన్ని కారణాల వల్ల మాత్రమే స్వల్ప సంఖ్యలో సర్వీసులు రద్దవుతున్నాయని చెప్పింది. ఇటీవల వారం రోజులకు పైగా ఈ విమానయాన సంస్థ వందల కొద్ది సర్వీసుల్ని రద్దు చేసింది. దాంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. కేంద్రం కూడా ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకొని, దర్యాప్తు కమిటీ వేసింది. ఇదిలా ఉంటే.. తమ సేవలు గాడిన పడుతున్నాయని డిసెంబర్ 9న సంస్థ సీఈఓ పీటర్ ఎల్బర్స్ వెల్లడించిన సంగతి తెలిసిందే. మామూలుగా అయితే ఈ సంస్థ రోజూ 2,200పైగా సర్వీసుల్ని నడుపుతుంటుంది.

## సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనం: మహేశ్‌గౌడ్



హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచి ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం.. ప్రజల విశ్వాసానికి నిదర్శనమని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పంచాయతీ ఎన్నికల తొలి విడతలో.. కాంగ్రెస్ మద్దతుదారులైన అభ్యర్థులు ఘన విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో సామాజిక న్యాయం స్పష్టంగా కనిపించిందన్నారు. మొదటి విడత ఎన్నికల్లో 90 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ అనుబంధ అభ్యర్థులే గెలుపొందడం.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అద్దం పట్టే ఈ ఫలితాలు, ప్రభుత్వంపై వారి అపార నమ్మకాన్ని తిరిగి చాటుతున్నాయని టీపీసీసీ అధ్యక్షుడు విడుదల చేసిన ప్రకటనలో అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికలను కాంగ్రెస్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపథ్యంలో, పార్టీ తరఫున ఎన్నికల పర్యవేక్షణలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. నిరంతరం మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ గ్రామ స్థాయి వరకు ప్రచార వ్యూహాలు రూపొందించి అమలు చేసిన విధానమే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేసే క్రమంలో, ప్రజలను నేరుగా కలిసే పద్ధతి కాంగ్రెస్‌కు మరింత అనుకూలంగా మారిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండు సంవత్సరాల ప్రజాపాలన సంక్షేమం- అభివృద్ధి పథకాలతో ప్రజలకు చేరువైందని, ప్రజా పాలన పట్ల ప్రజల సంతృప్తి పంచాయతీ ఎన్నికల్లో స్పష్టంగా ప్రతిఫలించిందని మహేశ్‌గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు.. గ్రామస్థాయి సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కట్టుబడి పనిచేయడం, గ్రామీణ ఓటర్లలో కాంగ్రెస్‌పై విశ్వాసం పెరిగేందుకు కారణమైందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనారిటీలు, దళితులు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత విస్తృతంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలపడం, గ్రామ పాలనా వ్యవస్థలో నూతన దిశకు సంకేతం అని వ్యాఖ్యానించారు.

ఈ విజయం పార్టీకి మరింత బాధ్యతను పెంచిందని.. గ్రామీణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి ప్రాధాన్యత కేంద్రంగా మార్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు.

## కొండా సురేఖకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ




హైదరాబాద్, డిసెంబర్ 11: తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై నాంపల్లిలోని ప్రత్యేక కోర్టు గురువారం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావా కేసులో మంత్రి కొండా సురేఖపై ఈ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అనంతరం ఈ కేసు విచారణను వచ్చే ఏడాది ఫిబ్రవరి 5వ తేదీకి నాంపల్లి ప్రత్యేక కోర్టు వాయిదా వేసింది. ఈ కేసులో సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ విచారణ సమయంలో మంత్రి కొండా సురేఖ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకాలేదు. దీనిపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసు తదుపరి విచారణ ఫిబ్రవరి 5వ తేదీన వ్యక్తిగతంగా హాజరు కావాలని కొండా సురేఖను కోర్టు ఆదేశించింది.

**ఇంతకీ వివాదం ఏమిటంటే..?...** గతంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ విమర్శలు చేసే క్రమంలో.. నాగచైతన్య, సమంత విడాకులపై తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఇవి వివాదాస్పదమైనాయి. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాంపల్లిలోని ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తనపై ఆరోపణలు చేశారంటూ.. తన పరువుకు నష్టం కలిగించేలా మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ ఆయన కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గతంలో తాను మంత్రిగా పని చేశానని.. పార్టీకి కార్యనిర్వాహక అధ్యక్షుడి ఉన్నానని ఆయన కోర్టుకు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా సాక్షులుగా ఉన్న బీఆర్ఎస్ పార్టీ నేతలు బాల్కా సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజ్ శ్రవణ్ స్టేట్‌మెంట్లను సైతం కోర్టు రికార్డు చేసింది. కోర్టులో ఈ కేసు విచారణ ప్రస్తుతం కొనసాగుతోంది. ఇక మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను హీరో అక్కినేని నాగార్జున తప్పు పట్టారు. కొండా సురేఖపై పరువు నష్టం దావా వేశారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్పింగ్స్, సోషల్ మీడియా లింక్స్‌తో కలిపి నాంపల్లిలోని ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ కుటుంబ పరువు ప్రతిష్టకు భంగం కలిగించేలా కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారని.. చట్టపరమైన క్రిమినల్ చర్యలతోపాటు పరువునష్టానికి సంబంధించి బీఎస్ఎస్ 356 కిద చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. అయితే ఇటీవల మంత్రి కొండా సురేఖ.. హీరో నాగార్జునకు క్షమాపణలు చెప్పారు. దాంతో ఈ కేసును హీరో నాగార్జున ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే.

## ఇద్దరు ఐఏఎస్ అధికారులకు తెలంగాణ హైకోర్టు నోటీసులు.. కారణమిదే

హైదరాబాద్, డిసెంబర్ 11: ఆర్టీఐ చట్టం కింద సమాచారం ఇవ్వలేదంటూ దాఖలైన పిటిషన్‌పై ఇద్దరు ఐఏఎస్‌లకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఆదేశాలు ఉన్నా ఆర్టీఐ చట్టం కింద సమాచారం అందజేయలేదని మాజీ జీహెచ్ఎంసీ కమిషనర్ కె.ఇలంబర్తి, ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్లకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఆర్టీఐ చట్టం ప్రకారం పిటిషనర్ అడిగిన సమాచారం ఇవ్వకపోవడంతో గతంలో సికింద్రాబాద్‌లోని రాంగోపాల్‌పేటకు చెందిన వడ్డం శ్యామ్ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం వెంటనే అడిగిన సమాచారం ఇవ్వాలని నవంబర్ 24న ఆదేశాలు జారీ చేసింది. అయితే హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదని శ్యామ్ మరోసారి కోర్ట్‌ను ఆశ్రయించారు. ఈరోజు (గురువారం) విచారణ జరిపిన ధర్మాసనం.. ఐఏఎస్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ధిక్కరణ కింద చర్యలు ఎందుకు తీసుకోవద్దో తెలపాలని ఐఏఎస్ అధికారులపై మండిపడింది. కోర్టు ఆదేశాలు ఎందుకు పాటించలేదో వివరిస్తూ జనవరి 26న కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా కోర్ట్ ఉత్తర్వులు పాటించకపోతే జరిమానా విధిస్తామని ఇద్దరు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ధర్మాసనం హెచ్చరికలు జారీ చేసింది.







న్యూఢిల్లీ, డిసెంబర్ 11: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. శుక్రవారం పోలీసుల ముందు సరండర్ కావాలని ప్రభాకర్ రావును జస్టిస్ బి.వి. నాగరత్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. రేపు ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ (సిట్) ముందు హాజరు కావాలని ఆయనకు స్పష్టం చేసింది. ఏసీపీ వెంకటగిరి ముందు హాజరుకావాలని ప్రభాకర్ రావుకు సూచించింది. విచారణ సమయంలో ఆయనను ఎటువంటి టార్చర్ చేయవద్దంటూ సిట్ అధికారులకు సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. ఈ కేసు విచారణను వచ్చే శుక్రవారం పర్యవేక్షించనున్నట్లు సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. కస్టడీ సమయంలో ప్రభాకర్ రావుకు ఇంటి నుంచి భోజనాన్ని తీసుకు వెళ్లేందుకు న్యాయస్థానం అనుమతించింది. మరో వైపు ఈ కేసులో 14 రోజుల పాటు ప్రభాకర్ రావును విచారణకు అనుమతించాలని సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు బెయిల్ రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. ఈ కేసును గురువారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌పై గతనెల.. నవంబర్ 18వ తేదీనే వాదనలు జరగాల్సి ఉంది. కానీ ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది అందుబాటులో లేరు. దాంతో ఈ పిటిషన్‌పై విచారణ పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. చివరగా ఈ రోజు.. అంటే గురువారం ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక ఆధారాలను ప్రభాకర్ రావు ధ్వంసం చేశారంటూ సుప్రీంకోర్టును తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయించింది. డిజిటల్ ఎక్విప్‌మెంట్, పాస్ వర్డ్ ఇవ్వకుండా విసిగించడంతోపాటు విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించ లేదని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు తమ వాదనల ద్వారా వినిపించారు. దీంతో ఫోరెన్సిక్ నిపుణుల ముందు ఐ క్లౌడ్, పాస్ వర్డ్ రీసెట్ చేయాలని గత విచారణలో ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం విదితమే.

**ఇది జరిగింది.. ?...** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీల నేతలపైనే కాకుండా.. స్వపక్షంలోని పలువురు అగ్రనేతల నేతలపై ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే విషయాన్ని వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కీలక నేతలు సైతం పలుమార్లు వివిధ వేదికల మీద ఆరోపించారు. 2023 ఏడాది చివరిలో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో.. కాంగ్రెస్ పార్టీకి ఓటరు పట్టం కట్టాడు. దీంతో రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం కొలువు తీరింది. ఫోన్ ట్యాపింగ్ అంశంపై వాస్తవాలు వెలికి తీయాలంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్)ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్‌లో కీలకంగా వ్యవహరించిన పలువురు ఉన్నతాధికారులను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. దాంతో ఫోన్ ట్యాపింగ్ జరిగింది వాస్తవమని వారు ధృవీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉన్నతాధికారులను అరెస్ట్ చేశారు. అయితే ఈ కేసులో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ఆయనను భారత్‌కు రప్పించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం పలు ప్రయత్నాలు చేసింది. ఈ విషయం తెలుసుకున్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు.. సిట్ అధికారులు తనను అరెస్ట్ చేయకుండా ఉండాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రభాకర్ రావును ముందస్తు అరెస్ట్ చేయవద్దంటూ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దాంతో స్వదేశానికి వచ్చిన ప్రభాకర్ రావు.. సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. కానీ ఈ విచారణలో అధికారులు సంధించిన ప్రశ్నలకు ప్రభాకర్ రావు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. బెయిల్ కోసం సుప్రీంకోర్టును ఆయన ఆశ్రయించారు. ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ప్రభాకర్ రావు బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టును రేవంత్ ప్రభుత్వం ఆశ్రయించింది. ఈ కేసులో వాదోపవాదాలు విన్న అత్యున్నత న్యాయస్థానం.. పోలీసుల ఎదుట లొంగిపోవాలంటూ ప్రభాకర్ రావును ఆదేశించింది.

## మిమ్మల్ని చూస్తుంటే రతన్ టాటా గుర్తొస్తారు: ఆనంద్ మహీంద్రాపై చిరంజీవి ప్రశంసలు



మహీంద్రా గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్రాపై చిరంజీవి ప్రశంసలు కురిపించారు. ఆనంద్ మహీంద్రాను చూస్తుంటే ఎన్నో విషయాల్లో రతన్ టాటా గుర్తొస్తారని అన్నారు. ఇటీవల జరిగిన 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' కార్యక్రమంలో ఆయనతో దిగిన ఫొటోను చిరు ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "డియర్ ఆనంద్ మహీంద్రా మీ వినయం, ఎంత ఎదిగినా ఒదిగిఉండే స్వభావం నిజంగా ఆదర్శనీయం. మీరు ఎన్నో విషయాల్లో రతన్ టాటాను గుర్తుకు తెస్తారు. ఆయన తన విలువలతో గొప్ప వ్యక్తిగా ఎదిగి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. మీరు కూడా అలానే అనిపిస్తారు. సేవా కార్యక్రమాలపై మీ నిబద్ధత ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. మీతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉంది" అని చిరంజీవి రాసుకొచ్చారు. ఈ అవకాశం కల్పించిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. తాజాగా 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్' గురించి కూడా చిరంజీవి తాజాగా పోస్ట్ పెట్టారు. "తెలంగాణ రైజింగ్ - 2047 విజన్‌లో భాగంగా అన్ని రంగాలతో పాటు సినిమా రంగానికి కూడా ప్రాముఖ్యతను ఇస్తున్నారు. హైదరాబాద్‌ను ఫిల్మ్, ఎంటర్‌టైన్‌మెంట్ గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దాలనే విజన్ చాలా గొప్పది. హైదరాబాద్‌పై ప్రపంచ సినిమా దృష్టిసారిస్తుందని విశ్వసిస్తున్నా" అని అన్నారు.

## ఆత్మహుతి చేసుకుంటా: ఎమ్మెల్యే మాధవరం




హైదరాబాద్ : తాను ఎలాంటి కబ్జాలకు పాల్పడ లేదని.. తానేంటో ప్రజలకు తెలుసునని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. ఐడీపీఎల్ భూముల కబ్జాపై తనపై ఇద్దరు నేతలు అసత్య ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. ఆ భూముల్లో నివాసం ఉంటున్న పేదల జోలికి వెళ్తే ఆత్మాహుతి చేసుకుంటానని ఆయన హెచ్చరించారు. సదరు భూముల్లో తాను గజం జాగా కబ్జా చేశానని నిరూపిస్తే.. తాను జైలుకెళ్లేందుకు సిద్ధమని చెప్పారు. రూ. 4 వేల కోట్ల విలువైన భూ వివాదంపై లోతుగా దర్యాప్తు చేయాలని ఈ సందర్భంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా పాల్పడుతున్నారని తాను గతంలోనే చాలా సార్లు ఫిర్యాదు చేశానని ఆయన గుర్తు చేశారు. అక్కడ స్థానికంగా ఉంటున్న ఇంద్రనగర్ 70 ఏళ్ల క్రితం ఏర్పడిందని తెలిపారు.

అక్కడ నివసిస్తున్న ప్రజల కోసం డ్రైనేజీ, రహదారుల సౌకర్యం కల్పించాలంటూ జీహెచ్ఎంసీ నుంచి గతంలో నిధులు తీసుకొచ్చానని వివరించారు. అయితే ఐడిపిఎల్ ఉద్యోగులను తాను బెదిరించాననేది పూర్తిగా అవాస్తవమని ప్రకటించారు. ఈ ఆరోపణలను తాను పూర్తిగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు.

**ఇంతకీ ఏం జరిగిందంటే..?...** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. రాష్ట్రవ్యాప్తంగా జనం బాట పేరుతో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఆమె ప్రస్తావిస్తున్నారు. అలాగే తాజాగా కూకట్‌పల్లిలో ఆమె జనం బాట చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను ఆమె ప్రస్తావించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాధవరం కృష్ణారావుపై కవిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై బుధవారం ప్రెస్ మీట్ పెట్టి ఎమ్మెల్యే కృష్ణారావు కాస్తా ఘాటుగా స్పందించారు. దాంతో ఎమ్మెల్యే కృష్ణారావుపై జాగృతి నేతలతోపాటు అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. ఆధారాలతో సహా అన్ని విషయాలు బయటపెడతానంటూ కవిత స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కృష్ణారావు పై విధంగా స్పందించారు.

## గజ గజ.. సింగిల్ డిజిట్‌కి పడిపోయిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ : నగరంలో చలి తీవ్రత పెరిగిపోతుంది. పట్టణమంతా చలి ప్రభావానికి వణికిపోతుంది. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పడిపోయాయి. నగరవ్యాప్తంగా తీవ్రమైన చలి గాలులు వీస్తాయని, ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. ముఖ్యంగా ఉదయం వేళల్లో చలి తీవ్రత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. గాలిలో తేమ శాతం పెరిగిపోవడం, వాతావరణంలో వచ్చిన మార్పులతో చలి తీవ్రత పెరిగిందని శాస్త్రవేత్తలు అంటున్నారు. సాధారణంగా జనవరిలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అలాంటిది ఈ ఏడాది డిసెంబర్‌లోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. శేరిలింగంపల్లి 9 డిగ్రీలు, రాజేంద్రనగర్ 10.7, గచ్చిబౌలి 11, శివరాంపల్లి 12.4, తిట్టిఅన్నారం 12.4, మచ్చ బొల్లారం 13.1, అల్వాల్ 13.2, జీడిమెట్ల 13.3, కుత్బుల్లాపూర్ 13.4, కూకట్‌పల్లి 13.5, బేగంపేట 13.6, లింగంపల్లి 14.2, మాధాపూర్ 14.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## బాలకృష్ణకు మరో షాక్.. అఖండ-2పై హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్: తెలంగాణ హైకోర్టులో అఖండ 2 సినిమా టికెట్ల ధర పెంపుపై లంచ్ మోషన్ పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేయాలని కోరుతూ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి పిటిషన్ వేశారు. లంచ్ మోషన్‌కి అనుమతించిన న్యాయస్థానం.. టికెట్ల ధర పెంపుతో పాటు ప్రత్యేక షోల నిర్వహణపై విచారణ చేయనుంది. కాగా, అఖండ-2 తాండవం సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు రేవంత్ ప్రభుత్వం అనుమతి ఇచ్చిన సంగతి సంగతి తెలిసిందే. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు టికెట్ రేట్లు పెంచుకోవచ్చని ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌పై రూ.50, మల్టీప్లెక్స్‌లలో రూ.100 అదనంగా వసూలు చేసుకునేందుకు అనుమతి కల్పించింది. డిసెంబర్ 11వ తేదీ ప్రీమియర్ షో టికెట్ ధరను రూ. 600గా నిర్ణయించగా అందుకు కూడా ఓకే చెప్పింది. అయితే, టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇస్తూనే చిత్ర బృందానికి రేవంత్ ప్రభుత్వం ఓ షరతు పెట్టింది. సినిమా టికెట్ ధరల పెంపు ద్వారా వచ్చే లాభాల్లో 20 శాతాన్ని సినీ కార్మికుల సంక్షేమానికి కేటాయించాలని ఆదేశాలు జారీ చేసింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660